నాస్ సర్వేలో జిల్లాను ముందుంచుదాం


సమావేశానికి హాజరైన అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : విద్యార్థులకు అభ్యసన పఠనాన్ని అలవాటు చేసే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్)-2024లో జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కేంద్ర విద్య, మానవవనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సర్వేలో భాగంగా 3, 6, 9 తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ర్యాండమైజేషన్ ప్రకారం పాఠశాలలను ఎంపిక చేసి పరీక్షలు జరపాలని సూచించారు. ఉపాధ్యాయులు భాషాపరమైన సబ్జెక్టులు, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని స్పష్టం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు అభ్యసన ప్రాదీపిక పుస్తకాలు అందించారు.

నేడు ఉద్యోగ మేళా

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్ కార్యాలయం (పాత కలెక్టరేట్ భవనం, జన్కాపూర్)లో మంగళవారం జాబ్ మేళా ఉంటుందని సెంటర్ మేనేజర్ సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి 30 ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగ యువత హాజరు కావాలని సూచించారు.

అండగా చట్టాలు.. ఆపదలో నేస్తాలు

● నేడు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం


అల్లారుముద్దుగా పెంచిన తల్లిదండ్రుల బాగోగులు చూడటంలో కొందరు పిల్లలు నిర్లక్ష్యం చేస్తున్నారు. చిన్న చిన్న కారణాలతో అనాథలుగా రోడ్డున పడేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వయోవృద్ధుల సంరక్షణ, పోషణ బాధ్యతల విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టాలు తీసుకొచ్చింది. హక్కులు కాపాడటం, రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలపై అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కథనం.

మందమర్రి పట్టణం, ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే




అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న మందమర్రికి చెందిన లక్ష్మి (70)ని కూతురు, అల్లుడు చూడడం లేదని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌కు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మి భర్త పోశం సింగరేణి కార్మికునిగా పనిచేస్తున్న క్రమంలో చనిపోయాడు. ఆమెకు ముగ్గురు కూతుళ్లు. కాగా అందరి పెళ్లిలు చేసింది. లక్ష్మి బాధ్యతలు చిన్నకూతురు మరియమ్మ అల్లుడు జాని చూసుకుంటానని చెప్పడంతో పోశం సింగరేణి ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద ఇచ్చింది. కొన్ని నెలలుగా వారు పట్టించుకోకపోవడంతో పాటు తిడుతుండడంతో కలత చెందిన బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమశాఖ అధికారులు ఆమెను శ్రీ సాయి వృద్ధాశ్రమంలో చేర్పించారు.

ఉమ్మడి జిల్లాలో
వయోవృద్ధుల కుటుంబాలు : 1,580
వృద్ధాశ్రమాలు : 5



చట్టం ఏం చెబుతుందంటే..



- తల్లిదండ్రులను పోషించడానికి, వారి సంరక్షణ చర్యలు తీసుకోవడానికి పిల్లలు ముందుకు రాకుంటే ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలి.
- 57 సంవత్సరాలు దాటిన వారు సీనియర్ సిటిజన్‌గా ప్రభుత్వం ప్రకటించింది.
- ఆర్డీవో కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్ల విజ్ఞప్తుల పరిష్కారానికి ప్రత్యేకంగా న్యాయ సహాయ కేంద్రాలు (ట్రైబ్యునళ్లు) ఏర్పాటు చేశారు.
- ఫారం-ఏ నింపి దరఖాస్తును ఆర్డీవోకు ఇస్తే వారి స్థిర చరాస్తులు గతంలో పిల్లల పేరిట రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ వాటిని రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకు ఇచ్చే అధికారాన్ని చట్టం కల్పిస్తోంది.
- వారికి ఆహారం, దుస్తులు, నివాసం, మందుల ఖర్చులు భరించాలి. లేని పక్షంలో పోషణకు నెలకు రూ.10 వేలు చెల్లించాలి.
- 2007 చట్ట సవరణ ప్రకారం కొడుకులతో పాటు కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మైనార్టీ తీరిన మనుమలు, మనుమరాళ్లు కూడా వారి బాధ్యత స్వీకరించాలి.
- దరఖాస్తుల పరిష్కారానికి రెండు నెలల గడువు విధించారు. ప్రత్యేక పరిస్థితుల్లో గడువును ఒక్కసారి మరో 30 రోజులు పొడిగించేందుకు విచారణాధికారికి వీలుంటుంది.

జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ

సీనియర్ సిటిజన్ల సంరక్షణ, పోషణకు జిల్లా స్థాయిలో కమిటీ ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా ఎస్పీ, జిల్లా వైద్యాధికారి, డీఆర్‌డీఓ, ఆర్డీవో, సీనియర్ సిటిజన్ ఫోరం, ఎన్జీవోల నుంచి ఒక మహిళతో సహా ముగ్గురు వయోవృద్ధులు, జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంరక్షణాధికారులు సభ్యులుగా ప్రత్యేక కమిటీ ఉంటుంది. సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ఆయా సభ్యులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

సంరక్షణ కోరుకునే వారు ఏం చేయాలంటే...

పిల్లలు తమను సంరక్షించకుంటే వారు ఆర్డీవో వద్దకు వెళ్లి ఫారం -ఏ నింపి అందజేయాలి. దీనికి న్యాయవాదితో కూడా అవసరముండదు. అధికారులు తగిన సహకారం అందిస్తారు. అనంతరం ఆర్డీవో విచారణ నిర్వహించి పోలీసులకు తదుపరి చర్యల కోసం రాసే అవకాశం ఉంటుంది. లోక్ అదాలత్‌లో అర్జి ఇవ్వగలిగితే న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి చర్యలకు ఆదేశాలు ఇచ్చే అవకాశముంది. మానవ హక్కుల కమిషన్ ద్వారా కూడా ఉపశమనం పొందే వీలు ఉంటుంది.



అక్కున చేర్చుకుంటున్న వృద్ధాశ్రమాలు

కుటుంబ సభ్యుల నుంచి గెంటివేసిన, నిరాదరణకు గురైన, వీధిన పడిన వృద్ధులను వృద్ధాశ్రమాలు అక్కున చేర్చుకుంటున్నాయి. వారికి అన్నివిధాలా సేవలు అందిస్తూ ఆత్మీయుల్లా చూసుకుంటున్నాయి.



టోల్‌ఫ్రీ నెంబరు.. అందించే సేవలు

- వృద్ధాప్యంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేరుగా 14567 అనే హెల్ప్‌లైన్ ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.
- మానసిక ఇబ్బందులు ఉన్నవారు సాయం పొందవచ్చు. నడవలేని వారికి చక్రాల కుర్చీలు, చేతికర్రలు సమకూరుస్తారు.
- వయోవృద్ధుల ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై స్థాయి వ్యక్తిని ప్రత్యేక అధికారి నియమించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినా, వారి పట్ల అనుచితంగా ప్రవర్తించినా వారికి ఆరు నెలల నుంచి గరిష్ఠంగా 2 సంవత్సరాల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. రూ.10 వేల వరకు జరిమానా విధించేలా చట్టం రూపొందించారు.

గోసతో వచ్చాం.. గోడు తీర్చరూ

● ప్రజావాణిలో సమస్యల వెల్లువ

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన వచ్చింది. వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారులు సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు అందించారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రే పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆసిఫాబాద్‌లో.. 33 దరఖాస్తులు

వితంతు పింఛన్ ఇప్పించాలని జైనూర్ మండలం పట్నాపూర్‌కు చెందిన ముక్తాబాయి దరఖాస్తు చేశారు. సదరం ధ్రువపత్రం బ్లాక్ లిస్టులో పెట్టడంతో పింఛన్ నిలిచిందని చింతలమానెపల్లి మండలం బాబాపూర్‌కు చెందిన జ్యోతి అర్జీ పెట్టుకున్నారు. కాలనీలో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయని, కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేసి సరిచేయాలని వాంకిడి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన శ్యాంరావు వినతిపత్రం అందించారు. గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతూ సిర్పూర్(టి) మండలానికి చెందిన పాతట్లగూడ, హేక్ అహ్మద్‌గూడ గ్రామస్థులు దరఖాస్తు చేశారు.


సమస్య వింటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు


పల్లెదవాఖానా ప్రారంభించాలని కోరుతూ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లకు వినతిపత్రం సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్‌లో..

బెజ్జూరు మండలం ముంజంపల్లికి చెందిన పొర్శెట్టి శ్రీహరి తన భూమి దస్త్రాల్లో సీలింగ్‌పట్టాగా నమోదైందని, బ్యాంకు రుణం ఇవ్వడంలేదని సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు చింతగూడలో నివాసం లేనప్పటికీ, రేగులగూడకు చెందిన నలుగురు నివాస ధ్రువపత్రాలు జారీ చేశారని, వాటిని రద్దు చేయాలని కోరుతూ. మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు మహెబూబ్‌ఖాన్, మాజీ సర్పంచి గాదం సునీత ఫిర్యాదు చేశారు. దరఖాస్తు చేసుకుని అయిదేళ్లు అవుతున్నా వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు పింఛన్లు రావడంలేదని కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామానికి చెందిన పలువురు అర్జీ పెట్టుకున్నారు. చింతలమానెపల్లి మండలం కోర్సినికి చెందిన చౌదరి సంతోష్ కాస్తులో ఉన్న భూమికి పట్టాలేదని, మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ముత్తంపేట్‌లో పల్లెదవాఖానా ప్రారంభించాలని సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

కాగజ్‌నగర్‌లో మొత్తం	71
భూ వివాదాలు	34
పింఛన్ల కోసం	18
రేషన్ కార్డు	1
ఇతర సమస్యలపై	18


పింఛన్ల కోసం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కోసిని గ్రామస్థులు

మమ్మల్ని కుమారులు చేరదీస్తలేరు

- దంపతులు మొర్లె తారబాయి-పాశ్మీర్, గిన్నెలేటి, కౌటాల



మేమిద్దరం ముసలోళ్లమయ్యాం. మాకున్న 16.30 ఎకరాల భూమిని ముగ్గురు కుమారులకు పంచి ఇచ్చాం. తర్వాత నుంచి మమ్మల్ని పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం మాకు పోషణ కరవైంది. కుమార్తె ఆదెచందన ఇంట్లో జీవిస్తున్నాం. మా బాధ్యతలను కుమారులు చూసేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే మా భవిష్యత్తు అంధకారమవుతుంది. అధికారులు చొరవ చూపాలి.

లక్ష్యం పెట్టుకుని.. లక్షణంగా సాధించి

● డీఎస్సీ తొలి ర్యాంకర్ల మనోగతం

వారి పట్టుదల, అలుపెరుగని సాధన ముందు లక్ష్యం చిన్నదైంది. సడలని ఆత్మవిశ్వాసం తొలిర్యాంకు సాధించిపెట్టింది. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు, పల్లెల్లో పుట్టి, సర్కారు బడుల్లో చదివి, ఉద్యోగమే జీవితాశయంగా భావించిన వారిని.. తిరుగులేని విజేతలుగా నిలిపింది. సోమవారం డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ విభాగాల్లో తొలి ర్యాంకులు సాధించి ఔరా! అనిపించిన అభ్యర్థుల మనోగతం..

ఆసిఫాబాద్ అర్బన్, కాగజ్‌నగర్ గ్రామీణం, బెజ్జూరు, రెబ్బెన, న్యూస్‌టుడే

భర్త ప్రోత్సాహంతో..

- చిప్ప సుమిత, ఎస్ఏ బయోసైన్సు, కాగజ్‌నగర్



మా నాన్న శంకర్ పేపరు మిల్లులో చిరుద్యోగి. అయిదేళ్ల కిందట చనిపోయారు. ముగ్గురు అక్కాచెల్లెళ్లం. పదో తరగతి పూర్తి కాగానే పెళ్లి చేస్తానన్నారు. దీనికి నిరాకరించి మా ట్యూషన్ మాస్టారు మధుకర్‌తో చెప్పించి నాన్నను ఒప్పించాను. పదో తరగతి వరకు ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో చదివాను. ఉస్మానియా క్యాంపస్‌లో ఎమ్మెస్సీ సీటు వచ్చినా పరిస్థితుల కారణంగా మధ్యలో వదిలేశాను. తర్వాత పెళ్లి అయింది. మా ఆయన రామకృష్ణ టైలర్. చదువు, ఉద్యోగం పట్లనా శ్రద్ధను చూసి ప్రోత్సహించారు. 2010, 2017లో డీఎస్సీ రాశాను. ర్యాంకు రాలేదు. ప్రస్తుతం గిరిజన సంక్షేమశాఖలో సీఆర్టీగా పనిచేస్తూ 2024-డీఎస్సీకి సిద్ధమయ్యా. తొలి ర్యాంకే లక్ష్యంగా చదివాను. ఈ సారి నా కల నెరవేరింది. 81.18 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు వచ్చింది.

ఒక్క డీఎస్సీలో మూడు ఉద్యోగాలకు అర్హత

- పూదరి ప్రశాంత్, తుంగెడ, రెబ్బెన



మాది రెబ్బెన మండలం తుంగెడ. తల్లిదండ్రులు కేదారి, సత్యమ్మ. మాది వ్యవసాయ కుటుంబం. 2017లో డీఎస్సీలో విఫలమయ్యా. పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూనే ఈసారి ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టుల్లో 71.9 మార్కులతో తొలి ర్యాంకును, ఎస్ఏ సోషల్‌లో 72.9 మార్కులతో 10వ ర్యాంకు, ఎస్జీటీలో 81.18 మార్కులతో 14వ ర్యాంకును సాధించాను. నా భార్య ఎస్జీటీ ఉపాధ్యాయురాలు. ఆమె ప్రోత్సాహంతో ర్యాంకును సాధించాను.

నిరక్షరాస్య కుటుంబంలో అక్షర సుమం

- అంగల శిరీష, అందవెల్లి



మాది కాగజ్‌నగర్ మండలం అందవెల్లి. అమ్మానాన్న శివరాం, సంతరబాయి నిరక్షరాస్యులు. అన్నలిద్దరూ పాఠశాల చదువు వరకే ఆపేశారు. కుటుంబాన్ని మంచి స్థితిలో చూడాలన్న కసి నాలో పెరిగింది. బాగా చదివి ఉద్యోగం సాధించాలని పాఠశాల స్థాయి నుంచే కలలు కన్నాను. 2017 డీఎస్సీలో ఉద్యోగం సాధించలేకపోయా. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని అహర్నిశలు కష్టపడి చదివాను. ప్రస్తుతం ఎస్జీటీ విభాగంలో 86.17 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకును సాధించాను.

తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం

- తుమ్మిడె కమలాకర్, బెజ్జూరు



మాది బెజ్జూరు మండలం పాపన్నపేట. నాన్న బుచ్చయ్య వ్యవసాయదారుడు, అమ్మ లసుంబాయి గృహిణి. 2017 డీఎస్సీలో మంచి ర్యాంకు రాలేదు. ఎలాగైనా స్కూల్ అసిస్టెంట్ కొట్టాలని వ్యవసాయ పనులు మానుకొని కాగజ్‌నగర్‌లో గదిని అద్దెకు తీసుకొని సొంతంగా సిద్ధమయ్యా. తొలి ర్యాంకునే లక్ష్యంగా పెట్టుకొన్నాను. నాకు ఉద్యోగం వస్తే మా కుటుంబం బాగుపడుతుందని పట్టుదలతో చదివాను. ఎస్ఏ సాంఘిక శాస్త్రంలో 81.10మార్కులతో జిల్లాలో తొలి ర్యాంకు వచ్చింది. అమ్మానాన్న కళ్లలో ఆనందం చూడగలిగా.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ డెమో అథెంటిఫికేషన్, బయోమెట్రిక్ అథెంటిఫికేషన్, రిజిస్ట్రేషన్ దశల్లో ఉంటుందన్నారు. మూడు దశలు పూర్తయ్యాక హార్డ్ కాపీలను సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్‌కు సమర్పించాలని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.




విద్యార్థులతో కలిసి నేలపై నిద్రిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

తనిఖీ చేపట్టి.. బస చేసి!

సిర్పూర్(టి), న్యూస్‌టుడే : మండలంలోని ఆశ్రమ గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం రాత్రి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తనిఖీలు నిర్వహించి రాత్రి పాఠశాలలోనే బస చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు శౌచాలయాలు ఏర్పాటు చేయాలని, పిచ్చి మొక్కలు తొలగింపజేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం భోజనశాల పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేసి, లైట్లు అమర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు కొద్దిసేపు బోధించారు. రాత్రి విద్యార్థులతో కలిసి నేలపై నిద్రించారు.

నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 పరీక్షలో 1:3 నిష్పత్తిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 1-5 తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు అటెస్ట్ చేయబడిన రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. 1:3 లో ఎంపికైన అభ్యర్థులకు వారి చరవాణికి ఎస్ఎంఎస్ లేదా మెయిల్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. ఈ సమాచారం అందిన వారు మాత్రమే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

నిశిరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురి దుర్మరణం
- గుడిహత్నూరు మండలం మేకలగండి వద్ద ఘటన

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే

వారంతా నిశిరాత్రి కారులో ఇంటికొస్తున్నారు. మరో 15 నిమిషాలైతే ఇంటికి చేరేవారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను రాసుకుంటూ దూసుకెళ్లింది. అదుపు తప్పి సిమెంట్‌కాల్వలో బోల్తాపడటంతో నలుగురు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జాతీయ రహదారి-44 పై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. అదుపు తప్పిన కారు డివైడర్‌ను రాసుకుని దాదాపు వంద మీటర్లు వెళ్లి ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో మోయిజ్(60), అలీ(8), ఖాజా మోయినొద్దీన్(40), మొహమ్మద్ ఉస్మానుద్దీన్(11) దుర్మరణం పాలయ్యారు. ఆయేషా అఫ్రీన్, ఫరీద్, ఎక్రా, సాథ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని సంఘటనా స్థలం నుంచి మూడు 108 అంబులెన్స్‌ల ద్వారా రిమ్స్‌కు తరలించారు. వీరంతా ఆదిలాబాద్‌కు చెందినవారే. మేకల గండి నుంచి ఆదిలాబాద్ 15 కి.మీ.దూరం. 15 నిమిషాల్లో ఇంటికి చేరే వారని అంతలోనే మృత్యువు కబళించిందని బంధువులు రోదించారు.



ప్రమాదం ఊహాచిత్రం




మృతులు


సంఘటన స్థలంలో క్షతగాత్రులు



అరటికి ప్రత్యేక రాయితీ



ఆయిల్‌పామ్‌లో అరటిని అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 50 నుంచి 57 వరకు ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేస్తారు. అయితే అరటిని మధ్యలో ఎకరానికి 1200 వరకు మొక్కలు సాగు చేసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక రాయితీ ఇస్తుంది. 11 నెలలకు ఒకసారి చేతికి వచ్చే అరటి వల్ల ఎకరానికి రూ. ఒక లక్ష అదనంగా ఆదాయం పొందే అవకాశముంది.

సోయాబీన్.. గిట్టుబాటు



ఆయిల్‌పామ్‌లో సాగు చేసే మరో పంట సోయాబీన్.. మూడు నెలల పంట. దీన్ని రెండు ఆయిల్‌పామ్ సాళ్ల మధ్య ఆరు నుంచి ఏడు సాళ్లు సాగు చేయవచ్చు. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు అదనంగా ఆదాయం పొందే అవకాశముంది. దీని తర్వాత తిరిగి శనగను అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. వీటితో పాటు పత్తి, అరటి, ఉల్లి, కూరగాయలు, కంది అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. ప్రధాన పంటలో మధ్యమధ్య సాళ్లలో వీటిని సాగు చేయడం వల్ల ఆయిల్ పామ్‌తో పాటు అంతర పంటలతో అదనంగా ఆదాయం పొందే అవకాశముంది.

అంతర సాగు.. ఆదాయం బాగు..

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులు ఇప్పుడిప్పుడే ఉద్యాన వన పంటలపై దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో ఏటా సాగు పెరుగుతోంది. సాగు పెంచేందుకు రాయితీలు అందజేస్తూ ప్రోత్సహిస్తుండటంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇందులో అంతర పంటలు సాగు చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉండటం... దీనికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుండటంతో రైతులు ఆయిల్ పామ్‌లో అంతరపంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఒకే చేనులో.. ఒకే పెట్టుబడితో రెండు రకాల పంటలు పండించడం తక్కువ పెట్టుబడితో గిట్టుబాటు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అంతరపంటలపై దృష్టి సారిస్తే మరింత దిగుబడి సాధించవచ్చని మంచిర్యాల క్లస్టర్ ఉద్యానవన అధికారి సహజ వివరించారు.

రైతేరాజు

రాయితీ ఇలా:

రైతులు దీనిని ఎన్ని ఎకరాల్లోనైనా సాగు చేసుకోవచ్చు. ఒక మొక్క ధర రూ. 193 కాగా దీనిని రూ. 20కే అందిస్తున్నారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం కాగా రైతులు ఎకరాకు రూ. 1100 చెల్లించాలి. బిందు సేద్యం రాయితీని ఒక రైతుకు పన్నెండున్నర ఎకరాలలోపు మాత్రమే అందిస్తారు. అంతర పంటలు సాగు చేస్తే మొక్కలు పెరిగే వరకు నిర్వహణకు ఎకరాకు రూ. 4200 చొప్పున నాలుగేళ్లపాటు అందిస్తారు.

నేరుగా మిల్లుకు..



ఆయిల్‌పామ్ మధ్యలో సరుగుడు మొక్కలను ఎకరానికి రెండు వేల నాటవచ్చు. రెండేళ్ల తర్వాత పెరిగిన చెట్ల కొయ్యలు అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చు. వీటిని నేరుగా సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని మిల్లుకు తరలిస్తే అక్కడ కొనుగోలు చేస్తారు. రవాణాతో కలిపి ఒక్కో మొక్కకు రూ. 2.50 పైసల ఖర్చు వస్తుంది. పెరిగిన తర్వాత కంపెనీ వారే రైతుల చేలల్లోకి వచ్చి ఉచితంగా చెట్లను కొట్టించి తీసుకెళ్లి పంటను బట్టి డబ్బులు అందజేస్తారు.

రైతు ప్రశ్న – శాస్త్రవేత్త సమాధానం



శివకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి.
చరవాణి సంఖ్య: 91002 29854

?: బెండలో పచ్చదోమ ఆశిస్తోంది. ఎలా నివారించవచ్చు? **శంకర్ రైతు, చింతగూడ**

✓ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, దండేపల్లి

జీవాలలో నీలి నాలుక వ్యాధి నివారణ ఇలా..

మీకు తెలుసా?

జీవాలలో ఎక్కువగా వచ్చేది నీలి నాలుక వ్యాధి. ఇది రియోవిరిడే అనే కుటుంబానికి చెందిన వైరస్ వల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వల్ల రక్త కణాలు దెబ్బ తినడంతో పాటు రక్త నాళాలు వాస్తాయని పశువైద్యాధికారి డా. ధన్‌రాజ్ పేర్కొన్నారు. దీంతో పాటు కాలి గిట్టలు వస్తాయని దీనివల్ల నడవడం ఇబ్బందిగా మారి కుంటుతాయని వివరించారు. ఈ వ్యాధి నివారణకు ఉప్పు కలిగిన గంజి, రాగి జావ, ఓఆర్ఎస్ ద్రావణం క్రమం తప్పకుండా తాగించాలని వివరించారు. దీంతో పాటు ముందస్తుగా టీకాలు వేయించాలని, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

పండగల వేళ.. లాభాల బంతి

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం : సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేస్తే అన్నదాతలకు ఆదాయం పెరుగుతుంది. ప్రస్తుతం బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి వరుసగా రాబోతున్నాయి. ఇప్పుడు పూలకు భలే గిరాకీ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని బంతి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు ఆదిలాబాద్ గ్రామీణ మండల కచ్‌కంటి గ్రామానికి చెందిన కొక్కుల సంజీవ్.



సంజీవ్ సాగు చేస్తున్న బంతి తోట

ఆదర్శం

కచ్‌కంటి గ్రామానికి చెందిన కొక్కుల సంజీవ్ పదేళ్లుగా బంతిపూలను సాగు చేస్తున్నారు. ఆరు ఎకరాలు కౌలు తీసుకొని నాలుగున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మిగతా భూమిలో సంజీవ్ బంతి పూల సాగు చేపట్టారు. పండగల వేళ దిగుబడి వచ్చేలా ప్రణాళికతో పచ్చ, ఎర్ర బంతి మొక్కలు నాటారు. లక్ష పెట్టుబడిగా పెట్టగా.. విత్తనాలకు రూ.50 వేలు ఖర్చు చేశారు. నాలుగు నెలలకే దిగుబడి చేతికొచ్చింది. ఇప్పటికే వినాయక చవితి పండగకు వ్యాపారులు తోట వద్దకే వచ్చి కొనుగోలు చేశారు. ఒక్క ఎకరానికి 5 నుంచి 6 టన్నుల బంతి పూలు దిగుబడిగా వస్తున్నాయని రైతు చెబుతున్నారు. నాలుగు నెలల వ్యవధిలోనే లక్షన్నర లాభం వస్తోందని ఆనందంగా చెబుతున్నారు. పదేళ్లుగా బంతిపూలు సాగు చేస్తున్నాను. వ్యాపారులు తోట వద్దకే రావడం.. స్థానిక మార్కెట్‌లోనే పూలను విక్రయించడంతో రవాణా ఖర్చులు లేకపోవడంతో అనుకున్నంత లాభం వస్తోంది. దసరా, దీపావళికి పూల ధరలు పెరగడంతో మరింత మెరుగైన ఆదాయం వస్తోందని అంటున్నారు.

భారీగా ఆశలు తీరాలి బాధలు



ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ప్రాజెక్టుల్లో 75 శాతం, అంతకన్నా ఎక్కువ నిర్మాణం పూర్తయిన వాటికి అవసరమైన నిధులిచ్చి పనులు పూర్తి చేసి సాగు నీరు అందించే ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాలో అయిదు ఉన్నట్లు గుర్తించారు. మొదటి కేటగిరీలో నాలుగు ప్రాజెక్టులుండగా రెండో కేటగిరీలో ఒక ప్రాజెక్టు ఉంది. ప్రస్తుతం రూ. 167.83 కోట్లు మంజూరు చేస్తే వచ్చే వానాకాలంలో 28 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని నీటి పారుదలశాఖ అధికారులు ప్రతిపాదించడంతో నిధుల విడుదలకు సీఎం అంగీకరించడంతో ఆశలు చిగురించాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 18కిపైగా ప్రాజెక్టులు ఉన్నా వీటిలో చాలా వరకు కొద్ది మొత్తంలో పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. తక్కువ ఖర్చుతో వానాకాలం సీజన్‌లో సాగు నీటిని అందించే ప్రాజెక్టులను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించడంతో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం, సదర్మాట్‌తోపాటు మంచిర్యాల జిల్లాలో నీల్వాయి ప్రాజెక్టు, ఆదిలాబాద్ జిల్లాలోని మత్తడివాగు ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

రెండో కేటగిరీలో పెన్‌గంగ



పెన్‌గంగపై నిర్మాణంలో ఉన్న చనాఖా కొరాట రిజర్వాయర్

లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు కింద 50,800 ఎకరాలకు సాగు నీరు అందాలి. ప్రాజెక్టు పరిధిలో చనాఖా కొరాట రిజర్వాయర్ పనులు చివరి దశలో ఉన్నాయి. మిగిలిన పనులు పూర్తి చేస్తే వచ్చే వానాకాలం సీజన్‌లో 27,794 ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇందుకు రూ. 147.23 కోట్లు అవసరం. ప్రతి నెల ఎంత మొత్తం అవసరమో అంచనాకు రావడంతో పాటు ఈ నిధులను క్రమం తప్పకుండా ఇవ్వాలని, అప్పుడే లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయగలుగుతామని నీటి పారుదల శాఖ అధికారులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో గుర్తించిన ప్రాజెక్టులు, నిధుల అవసరం, సాగులోకి వచ్చే ఎకరాలు

ప్రాజెక్టు	నిధులు	ఎకరాలు
లోయర్ పెన్‌గంగ	147.23	27,794
మత్తడివాగు	4.39	1,200
సదర్మాట్	97.37	18,016
పిప్రి	49.07	4,214
నీల్వాయి	17.00	5,000

● నిర్మల్, జగిత్యాల జిల్లాలకు మేలు చేసే సదర్మాట్ ప్రాజెక్టు చివరి దశలో ఉంది. రూ. 97.37 కోట్లు వెచ్చిస్తే 18 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. దీనికి విద్యుత్తు సౌకర్యం కల్పించాల్సి ఉంది. ప్రాజెక్టు పనులు పూర్తయితే నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● మంచిర్యాల జిల్లా పరిధిలోని నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయి. ఇటీవల రూ. 50 లక్షలు అటవీశాఖకు చెల్లించడంతో అనుమతులు వచ్చే వీలుంది. రూ. 17 కోట్లు మంజూరు చేస్తే ఎడమ కాలువ కింద 5 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు కింద కాలువలు లేకుండా సాగు నీరు అందించేందుకు వీలుగా పనులు పూర్తికాగా కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. వీటికి రూ. 4.39 కోట్లు విడుదల చేస్తే అదనంగా మరో 1200 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

● నిర్మల్ జిల్లాలోని లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం పరిధిలో మోటార్లు, పైపులైన్, విద్యుత్తు సౌకర్యం తదితర వాటిని పూర్తి చేయాల్సి ఉంది. రూ. 49.07 కోట్లు మంజూరు చేస్తే 4,214 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయండి

ట్రైకార్ రాష్ట్ర ఛైర్మన్ బెల్లయ్య నాయక్

ఉట్నూరు, ఇంద్రవెల్లి న్యూస్‌టుడే : గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ బెల్లయ్య నాయక్ ఆదేశించారు. సోమవారం ఉట్నూరు పీఎమ్మార్సీలో ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించేందుకు క్షేత్రస్థాయి నుంచే ఎంపికను చేపట్టాలన్నారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం గిరిజన లబ్ధిదారులకు ఆర్థిక సహాయ పథకాల మంజూరు పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు ఇంద్రవెల్లి రైతు ఉత్పాదక జిన్నింగ్ మిల్లును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి దేశంలో ఆదర్శ జిన్నింగ్‌గా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి కృషి చేస్తామని ఆయన అన్నారు. నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంద్రవెల్లి గిరిజన అమరవీరులకు నివాళులర్పించారు. సేంద్రియ ఎరువుల ద్వారా కూరగాయలు సాగు చేస్తే వారికి రాష్ట్ర రాజధానిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి ట్రైకార్‌తో పాటు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు కృషి చేస్తారన్నారు. ఏపీఓ(జనరల్) జాదవ్ వసంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, ట్రైకార్ జీఎం శంకర్‌రావు, లక్ష్మిప్రసాద్, ఈఈ రాథోడ్ భీంరావు, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రం అందజేస్తున్న ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు,అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఎడ్లబండిపై తీసుకొచ్చి.. అభిమానాన్ని చాటి



ఉపాధ్యాయురాలిని తీసుకొస్తున్న విద్యార్థులు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కొమ్మెర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించిన గోసంగారి విజయలక్ష్మి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఇంతకాలం పాఠాలు బోధించిన ఉపాధ్యాయురాలు విరమణ పొందడంతో విద్యార్థులు వినూత్న రీతిలో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎడ్లబండిని అందంగా అలంకరించి అందులో ఉపాధ్యాయురాలిని కూర్చోబెట్టి పూలు చల్లుతూ పాఠశాల వరకు విద్యార్థులే తీసుకొచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాధాకృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలేఖ్య ఆసనాలకు.. పతకాలు ఫిదా

● జాతీయ స్థాయిలో రాణింపు

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే :

కఠినమైన ఆసనాలను సులభంగా సాధన చేస్తూ రాణిస్తున్నారీ యువతి. జాతీయస్థాయిలో పతకాల పంట పండించడంతోపాటు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఇలా తన ప్రతిభతో నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు గోలేటికి చెందిన కేసరి అలేఖ్య.



ఏరియల్ యోగా చేస్తున్న అలేఖ్య

రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన కేసరి ఆంజనేయులు గౌడ్, పద్మ కుమార్తె అలేఖ్య యోగాలో ప్రతిభ కనబరుస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పది వరకు చదువుకున్న ఆమె హనుమకొండలో ఇంటర్, డిగ్రీ కోర్సులను పూర్తి చేశారు. బెంగళూరులో యోగా ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని, ఎన్‌ఐఎస్‌లో యోగా కోర్సు, చెన్నైలో ఎంఎస్సీ(యోగా) చదివారు. తమిళనాడులోని మీనాక్షి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్స్ పూర్తి చేశారు. జల, ఏరియల్, ప్రెగ్నెన్సీ, కిడ్స్ యోగా ఇలా ఒక్కొక్క దాంట్లో ప్రత్యేక శిక్షణ తీసుకొన్నారు. ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో 2023లో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయి రెఫరీగా పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించే స్థాయికి ఎదిగారు.



యోగా శిక్షణ ఇస్తున్న అలేఖ్య

న్యాయనిర్ణేత స్థాయికి..

- 2016 సంవత్సరంలో కోల్‌కత్తాలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీలో పతకం సాధించారు.
- 2017లో హైదరాబాద్, మంచిర్యాల, నిజామాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నారు.
- 2018 విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి పతకం తీసుకొచ్చారు.
- 2019లో నాగ్‌పూర్, 2020లో బెంగళూరులో జరిగిన పోటీల్లో నోబుల్ వరల్డ్ రికార్డులో పాల్గొన్నారు.
- గత నెల 23-27 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి ఆలిండియా పోలీసు గేమ్స్‌లో రెఫరీగా వ్యవహరించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం..

అలేఖ్య ఇంటర్ చదువుతున్న రోజుల్లో కొంత అనారోగ్యానికి గురైంది. అప్పటికే బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిబిరంలో యోగా నేర్చుకుంటున్న తండ్రి ఆంజనేయులుగౌడ్ విషయం తెలుసుకుని కుమార్తెను యోగాపై ఆసక్తి కలిగించేలా ప్రోత్సహించారు. గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో ఉచితంగా నేర్పిస్తున్న యోగా శిక్షణలో చేరారు. కఠోర సాధన చేస్తూ ఆసనాలు చేయడం ప్రారంభించారు. 13 ఏళ్లుగా నిత్యం సాధన చేయడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. 'వయస్సుతో నిమిత్తం లేకుండా ఎవరైనా యోగా సాధన చెయొచ్చు. సంపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎనిదేళ్లుగా సాధన చేస్తున్నా. అమెరికా, దుబాయ్, సింగపూర్, మలేషియా దేశాలకు చెందిన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహిస్తున్నా. అంతర్జాతీయ స్థాయి యోగా శిక్షకురాలిగా ఎదగాలనేది నా లక్ష్యం' అని అలేఖ్య అన్నారు.

కేంద్రంలో భాజపా ప్రభుత్వం కూలుతుంది : రవి



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

ఆదిలాబాద్ అర్బన్: కేంద్రంలో భాజపా ప్రభుత్వం త్వరలో కూలుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. మహారాష్ట్రలో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో యావత్మాల్ జిల్లాకు పార్టీ పరిశీలకుడిగా నియమితులైన ఆయన మహారాష్ట్రకు వెళ్తూ ఆదిలాబాద్ పట్టణంలో ఆగారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఆస్తి తగాదాలతో మహిళ హత్య

మంచిర్యాలనేరవిభాగం: ఆస్తి తగాదాలతో ఓ మహిళ హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ బన్సీలాల్ కథనం మేరకు.. పట్టణంలోని మేదరివాడలో సోమవారం మధ్యాహ్నం చింత విజయలక్ష్మి (47) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతురాలి శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయి. చేతులు, మెడపై బలంగా దాడి చేయడంతోనే ఆమె చనిపోయినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కొంత కాలంగా తమ బంధువులతో ఆస్తి తగాదాలు ఉన్నాయని, వారే హత్య చేసి ఉంటారని మృతురాలి కూతురు రాపాల భవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతురాలి భర్త రామ్‌శంకర్ కొన్ని సంవత్సరాల క్రితమే మృతి చెందాడు.



విజయలక్ష్మి

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ.. జాతీయ స్థాయికి ఎంపిక

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. జిల్లాకు చెందిన రాహుల్ మొదటి స్థానంలో నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకోగా వైష్ణవి రెండవ స్థానంలో రజతం గెలుచుకుంది. వీరు త్వరలో కర్ణాటకలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతివర్మ, ప్రధాన కార్యదర్శి మండ శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

విద్యా.. ఉపాధికి మార్గం

నేటి పోటీ ప్రపంచంలో తమ ఆలోచనలకు అనుగుణమైన విద్యా కోర్సుల ఎంపికతో పాటు నైపుణ్యానికి అనువైన ఉద్యోగాల వేట కోసం సరైన సమయంలో సమాచారం అందడం అనేది చాలా ముఖ్యమైన అంశం. ఎన్ని నైపుణ్యాలు, ఎన్ని విద్యార్హతలు కలిగి ఉన్నా దానికి సంబంధించిన సమాచారం, దరఖాస్తు చేసే విధానం, ఆఖరు తేదీ వంటి అంశాలు తెలిసినపుడు ఉద్యోగార్థులకు, ఉన్నత విద్యనభ్యసించదలిచే విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీనిని గుర్తిస్తూ హైదరాబాద్‌కు చెందిన 'నిర్మాణ్' స్వచ్ఛంద సంస్థ టోల్‌ఫ్రీ నెంబరుతో విద్యార్థులు, ఉద్యోగార్థుల సమస్యలను తీరుస్తోంది. -న్యూస్‌టుడే, బజార్‌హత్నూర్

గ్రామీణ విద్యార్థులకు మేలు..

మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ సేవ చాలా మేలు చేకూర్చేలా ఉపయోగపడుతోంది. ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నా తగిన ఉద్యోగ సమాచారం సరైన సమయంలో తెలియక నష్టపోతున్నారు. ఈ సేవను వినియోగించుకుంటే ఈ సమస్యను చాలా వరకు అధిగమించవచ్చు.

హెల్ప్‌లైన్‌లో ప్రత్యక్ష సంభాషణ

నెంబరును ప్రెస్ చేసిన అనంతరం టెలీకాలర్ అందుబాటులోకి వస్తారు. మనకు కావలసిన, మన సందేహాలకు నిపుణులు తగిన సమాచారాన్ని వెంటనే అందజేస్తారు. ప్రస్తుతం మన విద్యార్హతలు ఏమిటి అనే దాని ఆధారంగా ఎలాంటి ఉద్యోగాలకు అర్హులం లేదా ఇంకా అందుబాటులో ఉన్న ఉత్తమమైన కోర్సులు ఏవి అనే అంశాలను లోతుగా తెలుసుకోవచ్చు.

nirmaan.org
Vidya Helpline ...Enlightening Young India
We have only one passion the rise of a great Nation

టోల్‌ఫ్రీ నెంబరుతో అందుబాటులో..



1800 425 2425 అనే టోల్ ఫ్రీ నెంబరుకు పని దినాలలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు ఉచిత కాల్ చేయొచ్చు. మొదట కంప్యూటర్ వాయిస్ ద్వారా వచ్చే సూచనలకు అనుగుణంగా విద్యా.. లేక ఉద్యోగ సమాచారమా అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. అనంతరం అభ్యర్థులు తాము ఏ భాషలో సమాచారం పొందగోరుతున్నారో దానికి అనుగుణంగా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

వాట్సాప్ ద్వారా..



విద్యా, ఉద్యోగ సమాచారం కోసం 90009 72653 నెంబరుకు వాట్సాప్ ద్వారా పేరు, జిల్లా పేరు, విద్యార్హత వివరాలను పంపాలి. తద్వారా ఆ నెంబరు రిజిస్టర్ అయ్యి సమాచారం నిత్యం ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా అందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి సమాచారం వాట్సాప్‌లో మనకు కనిపిస్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

? మండలంలోని కోసిని పంచాయతీ రాంనగర్ కాలనీలో పూర్తిస్థాయిలో వీధి దీపాలు లేక అంధకారం నెలకొంది.
- ప్రసాద్, స్థానికుడు

✔ రెండ్రోజుల్లో వీధి దీపాలు అమర్చేలా చర్యలు తీసుకుంటాం.
- రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్

యువకుడి ఆత్మహత్య

జైనూర్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లెండిగూడలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు(22) సోమవారం ఉదయం తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం కోపంతో సమీప చేనుకు వెళ్లి అక్కడే ఉన్న పురుగుమందు తాగాడు. మధ్యాహ్న సమయంలో చేనుకు వెళ్లిన తల్లి పడిపోయిన కొడుకును చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వాంకిడి, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ప్రజలకు యాంటీ బయాటిక్ మందులు విక్రయిస్తున్న ఆర్ఎంపీ వైద్యుడు కొండల్ సంతోష్‌ను సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని దాబా గ్రామానికి చేరుకుని మందులను పరిశీలించామన్నారు. అతని వద్ద ఎలాంటి అనుమతులు లేని మందులు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మందుల విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు. వైద్యుడితో పాటు మందులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్వినికి అప్పజెప్పినట్లు తెలిపారు.

పశువుల వాహనాల పట్టివేత

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 20 పశువులను పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. కౌటాల మార్కెట్ నుంచి పెద్దపల్లి జిల్లాలోని జూలపల్లి గ్రామానికి తరలిస్తున్న ఎద్దులను ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్సై వెంకటాపూర్ చెక్‌పోస్ట్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. జూలపల్లికి చెందిన మూడపల్లి స్వామి, గుంటి ఐలయ్య, ఆపాదపు ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చింతలమానెపల్లి: బాబాసాగర్ నుంచి అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై నరేష్ వివరాల ప్రకారం.. ఎలాంటి రసీదు లేకుండా ఏడు పశువులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మాలిక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వంతెన నిర్మాణం ఆలస్యం.. ఇబ్బందులు అనేకం!

మండలంలోని కిష్టాపూర్, జక్కులపల్లి గ్రామాల మధ్య రహదారిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. జక్కులపల్లికి చెందిన పది, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులు చదివే విద్యార్థులు నిత్యం రెబ్బెనకు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన పూర్తికాకపోవడంతో విద్యార్థులను తీసుకెళ్లే బస్సు కిష్టాపూర్‌లోనే ఆగిపోతుంటుంది. దీంతో వీరంతా నిత్యం గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరం నడిచి బస్సు ఎక్కుతూ ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఎం.తిరుపతి, డి.రామయ్య, బీమాక్, కృష్ణమూర్తి, శ్రావణ్, సాయి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లోనూ 108 వాహనం రాలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెబ్బెన



నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

పూడిక తీయరు.. మురుగు పారదు!





మండలంలోని కొమురవెల్లి గ్రామ పంచాయతీ పరిధి వాడల్లో మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలువల్లో పూడిక తీయక చెత్తచెదారం పేరుకుపోయింది. కొన్ని వీధుల్లో కాలువలే లేకపోగా.. ఉన్న వాటి వద్ద అదే పరిస్థితి. ఇళ్లలోని వృథా నీరంతా కాలువల్లోకి చేరి నెలల తరబడి నిలిచి ఉండటంతో.. ఆకుపచ్చగా మారాయి. ప్రధాన వీధిలో మురుగు రహదారి మీదకు పారుతుండటంతో.. ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. ఓవైపు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా పలుచోట్ల పారిశుద్ధ్య పనులు కొనసాగుతుండగా ఇక్కడ మాత్రం దాని ఆనవాళ్లు కూడా కనిపించడం లేదని చెబుతున్నారు. నారాయణపూర్ నుంచి రేచ్ని వెళ్లే రహదారి సైతం గుంతలమయమైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పూడిక తీత పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

- రెబ్బెన, న్యూస్‌టుడే

నేరాల నియంత్రణపై దృష్టి: ఎస్పీ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : నేరాల నియంత్రణకు ప్రతి పోలీసు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు, కుమురంభీం వర్ధంతి వేడుకలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తితే వెంటనే సంఘటన స్థలానికి చేరుకునేలా పూర్తి సంసిద్ధతతో ఉండాలన్నారు. తరచూ గ్రామాలను సందర్శిస్తూ పరిస్థితులు తెలుసుకోవాలని, ప్రతి స్టేషన్ పరిధిలోని ఆటోలకు ప్రత్యేక యూనిక్ నంబర్ కేటాయించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ వారీగా సిబ్బందికి ప్రభుత్వ పోలీసు కవాతు, లాఠీ ఉపయోగం, అత్యవసర సమయంలో స్పందించే విషయాలపై శిక్షణ అందించాలని పేర్కొన్నారు. పెండింగ్ కేసులు, వాటి పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. గంజా, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్లు, ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, చోరీలు, మహిళలపై జరుగుతున్న నేరాలు తదితర వాటిపై సమీక్షించారు. జిల్లాలో అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎస్పీ రామానుజం, సీఐలు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.



ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు



హాజరైన పోలీసు అధికారులు

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా.. జిల్లాలో ఈ నెల 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, బహిరంగసభలు తదితర వాటి నిర్వహణకు ముందస్తుగా డీఎస్పీ ఆ పై స్థాయి పోలీసు అధికారుల నుంచి అనుమతి పొందాలన్నారు. నిషేధిత ఆయుధాలు, దురేద్దేశంతో నేరాలకు ఉసి గొలిపే ఆయుధాలు కలిగి ఉండరాదన్నారు.

తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ విశిష్టమైనది

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండగ ఎంతో విశిష్టత సంతరించుకుందని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్ల అన్నారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా సాధికారత విభాగం, ఎస్ఎఫ్ఐ, టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి వేడుకలు జరిపారు. ప్రిన్సిపల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ డా. లక్ష్మీనరసింహం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

టీపీఎస్‌ను సరెండర్ చేయాలని కౌన్సిలర్ల తీర్మానం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పురపాలికలోని ప్రభుత్వ స్థలాలు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో స్పందించని టీపీఎస్ యశ్వంత్‌ను సరెండర్ చేస్తూ కౌన్సిలర్లు సోమవారం తీర్మానించి ఆమోదించారు. పలు చోట్ల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు వలీ, డోంగ్రి సునీల్, మదన్‌లు టీపీఎస్‌ను కోరినా స్పందించలేదని, తనకు సంబంధం లేదని దురుసుగా మాట్లాడటంతో.. వాగ్వాదం చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో కౌన్సిలర్లు టీపీఎస్‌ను సరెండర్ చేయాలని తీర్మానించి ప్రతిని కమిషనర్ అంజయ్యకు అందజేశారు. తీర్మాన ప్రతిని ఉన్నతాధికారులకు నివేదించి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వినతి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జైనూర్ ఘటనలో తగలబెట్టిన దుకాణాల వ్యాపారాలకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకునేలా చూడాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ సభ్యులు.. సోమవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులకు చెందిన ఎనిమిది మంది వ్యాపారుల దుకాణాలు పూర్తిగా కాలిపోయాయన్నారు. తాటికొండ అశోక్, ముత్యపు విశ్వనాథ్, కోటగిరి రవీందర్, శ్రీనివాస్, కిషోర్, కె.విశ్వనాథ్, ఎర్రావార్ అశోక్, ఎం.రమేశ్ తదితరులకు సంబంధించి రూ.82 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు వివరించారు. అన్ని ఆస్తులు నష్టపోయి బాధలో ఉన్న వ్యాపారులపై అక్రమంగా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం కోశాధికారి సుగుణాకర్, సభ్యుడు గంధం శ్రీనివాస్, బాధిత వ్యాపారులు ఉన్నారు.

రెబ్బెన: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును మార్చి సూరవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టాలని ముఖ్యమంత్రి, మంత్రివర్గం నిర్ణయించడం సరికాదని జిల్లా ఆర్యవైశ్య మహాసభ సభ్యులు సోమవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. మహనీయుడైన ఆయన పేరును తీసివేయాలని నిర్ణయించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం పునరాలోచించి యథావిధిగా ఉంచాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న వైశ్య సంఘం సభ్యులు

నటనతో ఆకట్టుకున్నారు

★ జిల్లాస్థాయి సైన్సు డ్రామా పోటీల్లో అద్భుత ప్రదర్శన

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో నిర్వహించిన సైన్సు డ్రామా ఫెస్టివల్‌లో.. జిల్లా నలుమూలల పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు తమ నాటిక ప్రదర్శనలతో ఆకట్టుకొన్నారు. మానవజాతి పురోగతి కోసం శాస్త్ర సాంకేతికత అనే అంశంపై విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలిచ్చి జ్యూరీ మెప్పు పొందారు. పోటీల్లో జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలకు నీటి సమస్యపై ఇచ్చిన ప్రదర్శన ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. సిర్పూర్(టి)లోని ఈడెన్ గార్డెన్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ, ఆసిఫాబాద్‌లోని సిగ్మా పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఉత్తమ డైరెక్టరుగా వి.రాజేశ్, ఉత్తమ స్క్రిప్టు రైటర్‌గా సాగర్‌కుమార్, ఉత్తమ నటులుగా తోట శ్రీవాస్తవ, నబా హూరియా ఎంపికయ్యారు. జిల్లా సైన్సు అధికారి కటుకం మధుకర్, ముఖ్య అతిథిగా కళాశాల కరెస్పాండెంట్ తాటిపల్లి శివప్రసాద్, జ్యూరీ ప్రతినిధులు రాజ్‌కమలాకర్ రెడ్డి, కిల్లి వెంకట్రావు, మామిడాల తిరుపతయ్య, ఈవెంట్ ఆర్గనైజర్ డి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



అలరించిన విద్యార్థుల నాటిక ప్రదర్శన

డీఎస్సీ ఫలితాల్లో అన్నదమ్ములిద్దరికీ ర్యాంకులు

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో అన్నదమ్ములిద్దరూ స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)లో రెండు, మూడు ర్యాంకులు సాధించి ఔరా అనిపించారు. మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన అప్పాజి నారాయణ-లక్ష్మిలకు ఇద్దరు కుమారులు గణేష్, సతీష్. వీరిది వ్యవసాయ కుటుంబం. గణేష్ ప్రస్తుతం లోడ్పల్లి ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే జిల్లాలో రెండో ర్యాంకు సాధించారు. సతీష్ ఇంటి వద్దనే సన్నద్ధమై మూడో ర్యాంకు సాధించారు.



గణేష్



సతీష్

మూడింటిలో గణపతి సత్తా

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని చిన్నసిద్దాపూర్‌కు చెందిన టాకిరే గణపతి డీఎస్సీ ఫలితాల్లో మూడు విభాగాల్లో సత్తాచాటారు. స్కూల్ అసిస్టెంట్ (సోషల్‌లో) 74.23 మార్కులు రాగా.. జిల్లాలో 6వ ర్యాంకు, తెలుగుపండిత్‌లో 77.7 మార్కులతో 5వ ర్యాంకు, ఎస్జీటీలో 81.1మార్కులతో 17వ ర్యాంకు సాధించారు. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే తపనతో కష్టపడి చదివి ప్రభుత్వ కొలువు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.



గణపతి

ఆర్థికసాయంతోపాటు తులం బంగారం అందించాల్సిందే: ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథక లబ్ధిదారులకు ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. జైనూర్, సిర్పూర్(యు) మండలాల లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ రెండు మండలాలకు సంబంధించి 101 మందికి చెక్కులు మంజూరు కాగా 84 మంది హాజరయ్యారు. గతేడాది డిసెంబరు 9వ తర్వాత పెళ్లి చేసుకున్న వారి కుటుంబాలకు బంగారం వెంటనే అందించాలన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఉద్యోగ విరమణ వీడ్కోలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పదవీ విరమణ పొందిన ఆసిఫాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దీపక్ దేశ్ పాండేను కార్యాలయంలో సిబ్బంది, అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బి.బాలేశ్వర్‌గౌడ్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : లైంగిక దాడికి గురైన బాలిక కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి భరోసానిచ్చారు. సోమవారం సాయంత్రం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు.

ఆసిఫాబాద్: అత్యాచారానికి గురైన బాధితురాలి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు పేర్కొన్నారు. సోమవారం మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్‌తో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున ఆదుకునేలా చూస్తామన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ సర్పంచి కాశయ్య, సభ్యులు అరుణ్, సంజీవ్, సాయకృష్ణ, శేఖర్ తదితరులున్నారు.

మహిళలకు కోడిపిల్లల పంపిణీ

తిర్యాణి, న్యూస్‌టుడే: మండలంలోని 50 మంది స్వయం సహాయ సంఘం మహిళలకు ఒక్కొక్కరికి 20 చొప్పున వెయ్యి కోడిపిల్లలను సోమవారం పంపిణీ చేసినట్టు ఐకేపీ ఏపీఎం సదానందం తెలిపారు. హాసిల్ క్రాస్ జాతికి చెందిన వాటిని అందజేశారు. ఒక దానికి రూ.100 చెల్లించాల్సి ఉంటుందని, నాలుగు నెలల్లో 2-3 కిలోల బరువు పెరుగుతుందని చెప్పారు. స్వయం సహాయం సంఘం సభ్యులకు రుణం కింద మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి పాల్గొన్నారు.



కోడిపిల్లలు అందజేస్తున్న ఐకేపీ ఏపీఎం సదానందం, సీసీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో వృద్ధుల దినోత్సవం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ముందస్తు వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. బాలాజీనగర్ సెక్టార్ పరిధిలోని కౌసర్‌నగర్-2, బాలభారతిబస్తీ, సర్దార్‌బస్తీ, త్రైబనగర్, సంఘం బస్తీ, మారుతీనగర్, జైభీంకాలనీ, సుభాష్‌కాలనీ, కాపువాడ కాలనీల్లోని కేంద్రాల్లో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వృద్ధుల హక్కులను గురించి ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు భాగ్యలక్ష్మి వివరించారు. ఎవరైనా వృద్ధులు కుమారుల నుంచి ఆదరణకు నోచుకోకుంటే ప్రభుత్వపరంగా పరిష్కరించేందుకు ప్రత్యేక విభాగం ఉందని చెప్పారు. అనంతరం పలువురు వృద్ధులను శాలువాలతో సన్మానించి పండ్లు పంపిణీ చేశారు.



వృద్ధురాలికి అరటిపండ్లు అందజేస్తున్న ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు భాగ్యలక్ష్మి

విద్యార్థినులకు రక్త పరీక్షలు

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త హీనతతో బాధపడుతున్న 60 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు సంగీత విద్యార్థినులకు అవగాహన కల్పించారు. రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్, ఫార్మసిస్టు సాగర్, వైద్య సిబ్బంది ప్రమోద్, రుక్మిణి, శాంతాబాయి, రాజన్న, భగవందాస్, పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని గోయగాం, సోనాపూర్ గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. 53 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న ఏడుగురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్, వైద్య సిబ్బంది సునంద, హెల్త్ అసిస్టెంట్ భగవందాస్, ఆశావర్కర్లు మానుకుబాయి, సరోజ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఎంఐఎం పట్టణాధ్యక్షుడు అబ్దుల్ ముబిన్, కార్యదర్శి జావిద్ మల్నాస్‌లు కోరారు. సోమవారం వారు పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. ఇటీవలి వర్షాలకు ప్రహరీ కూలిందన్నారు. పక్కనే ఉన్న పాత ఎస్పీఎం క్వార్టర్లలో చెట్ల పొదల కారణంగా బడిలోకి విషపురుగులు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. అధికారులు స్పందించి విద్యార్థులకు ఎలాంటి హాని జరగకముందే చర్యలు చేపట్టాలని కోరారు.

రైళ్లు నడపాలని ఆందోళన

బల్లార్ష, న్యూస్‌టుడే : బల్లార్ష నుంచి ముంబయి, పుణేలకు ప్రత్యేక రైళ్లు నడపాలని జనవికాస్ సేన ఆధ్వర్యంలో.. సోమవారం బల్లార్ష రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. వికాస్ సేన అధ్యక్షుడు పప్పు దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. మధ్య రైల్వేలో ప్రధానమైన జంక్షన్ బల్లార్ష నుంచి రాష్ట్ర రాజధాని ముంబయితోపాటు పుణేకు నేరుగా రైలు లేదన్నారు. విద్యార్థులు, ఐటీ ఉద్యోగుల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్టేషన్ మాస్టర్ రవీంద్ర నందన్‌వార్ కు వినతిపత్రం అందజేశారు.

సంపూర్ణ అక్షరాస్యతే ప్రభుత్వ ధ్యేయం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజంలో 15ఏళ్లు పైబడిన వారందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ఆశయంతోనే ప్రభుత్వం న్యూఇండియా లిటరసీ కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ రమేష్ తెలిపారు. సోమవారం చారిగాం ప్రాథమికోన్నత పాఠశాలలో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అయిదుగురికి తగ్గకుండా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సుందిళ్ల రమేష్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఉపసర్పంచి మోర్లె తిరుపతి, గ్రామయువజన అధ్యక్షుడు నగోషె తిరుపతి, పాఠశాల ఎస్ఎంసీ మాజీ ఛైర్మన్ శంకర్, తదితరులున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యానికి అవకాశం ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల వద్ద నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి పాల్గొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడే పడేయొద్దన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పాఠశాల ఆవరణ, తరగతి గదులు పరిశుభ్రంగా ఉంచునేలా చూసుకోవాలని సూచించారు. ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మానవహారం నిర్వహించారు. ఎస్‌హెచ్ఎస్ ఆకారంలో విద్యార్థులు కూర్చొని ఆకట్టుకున్నారు. ఈజీఎస్ ఏపీవో చంద్రశేఖర్, ఎస్‌బీఎం సిబ్బంది పాల్గొన్నారు.

సర్దుబాటును రద్దు చేయాలని వినతి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో అసంబద్ధంగా చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటును రద్దు చేయాలని కోరుతూ పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పాలనాధికారి వెంకటేశ్ దోత్రేకు వినతి పత్రం సమర్పించారు. జూన్‌లో బదిలీ అయి నూతన స్థానంలో చేరలేకపోయిన ఉపాధ్యాయులను డీఎస్సీ నియామకాలకు ముందే విడుదల చేయాలని కోరారు. కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 57 బోధన, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్, కార్యదర్శి సిహెచ్.అనిల్‌కుమార్, నాయకులు కుమ్మరి రవి తదితరులున్నారు.

సెలవులకు ఇంకా మూడు రోజులు.. అప్పుడే ఇళ్లకు!

రాష్ట్ర ప్రభుత్వం అన్ని యాజమాన్య పాఠశాలలకు ఈ నెల 2-14 వరకు దసరా సెలవులు ప్రకటించింది. కానీ తిర్యాణి గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులకు ముందస్తు సెలవులతో ఇంటి బాటపట్టారు. సోమవారం పలువురు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ఇళ్లకు వెళ్లడం కనిపించింది. ఇక్కడ 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 535 మంది విద్యార్థులు చదువుతున్నారు. సాధారణంగా సెలవులకు ఒకరోజు ముందు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేయాల్సి ఉన్నా.. అటువంటిదేదీ లేకుండానే తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్లడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ప్రిన్సిపల్ రమ్యను వివరణ కోరగా. . సోమవారం కలెక్టరేట్‌లో ప్రిన్సిపల్స్‌తో సమావేశం నేపథ్యంలో జిల్లా కేంద్రానికి వచ్చినట్లు తెలిపారు. మూడు రోజుల నుంచే పిల్లల తల్లిదండ్రులు, బంధువులు వచ్చి ఉపాధ్యాయులతో గొడవలు, ప్రాధేయపడటంతో పంపిస్తున్నట్లు చెప్పడం గమనార్హం.

- న్యూస్‌టుడే, తిర్యాణి



ఆటోలో ఇంటి బాటపట్టిన విద్యార్థినులు

కోలిండియాలో సత్తాచాటడమే లక్ష్యం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే : కోలిండియాలో పతకం సాధనే లక్ష్యంగా ఆడాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌ఛార్జి ఎస్ఓటు జీఎం ఎన్.ఉమాకాంత్ అన్నారు. గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో సోమవారం బెల్లంపల్లి ఏరియా డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో నియర్ బై మందమర్రి, బెల్లంపల్లి డివిజన్ జట్ల మధ్య బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. యాజమాన్యం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో రాణించాలన్నారు. కార్మిక క్రీడాకారులు సోదరాభావంతో ఆటల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు. క్రీడల అభివృద్ధికి సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ జీపీ చంద్రకుమార్ పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న బెల్లంపల్లి ఏరియా ఇన్‌ఛార్జి ఎస్ఓటు జీఎం ఉమాకాంత్

కార్మికుల కష్టాలు ఇప్పుడు గుర్తుకొచ్చాయా?

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఎస్పీఎం పునఃప్రారంభమై ఆరేళ్లు కావస్తుండగా ఇన్నాళ్లకు బీఎంఎస్ అనుబంధ ఎస్పీఎం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కల్లోల భట్టాచార్యకు కార్మికులకు కష్టాలు గుర్తుకొచ్చాయా అని ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూశన రాజన్న, ఉపాధ్యక్షుడు ముంజం శ్రీనివాస్‌లు సోమవారం ప్రశ్నించారు. సంఘాలు లేనప్పుడు కార్మికులతో యాజమాన్యం ఒప్పందం చేసుకుందని, ప్రస్తుతం మరో సంవత్సరంలో గడువు ముగుస్తుందని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.